క్లుప్తంగా

'ఉపాధి' పనుల్లో వేగం పెంచాలి



కూలీల హాజరు శాతం పరిశీలిస్తున్న ఎంపీడీవో

ఇచ్చోడ: ఉపాధి పనుల్లో మరింత వేగం పెంచే దిశగా చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో లక్ష్మణ్ అన్నారు. గురువారం మండలంలోని గుబ్బలో నిర్వహిస్తున్న ఉపాధి పనులతో పాటు కూలీల హాజరు శాతాన్ని పరిశీలించారు. ఈ ఏడాది నిర్దేశించిన ప్రణాళిక ప్రకారం పనుల్లో వేగం పెంచి మే చివరి వరకు పూర్తయ్యే విధంగా చూడాలన్నారు. ఎండలు ఎక్కువగా ఉన్నందున ఉదయమే పనులు చేయాలని సూచించారు.

ఆలయ అభివృద్ధికి కృషి

నేరడిగొండ: ఆలయాల అభివృద్ధికి తనవంతుగా కృషి చేస్తానని కాంగ్రెస్ బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడే గజేందర్ అన్నారు. మండలంలోని శంకరపూర్ గ్రామంలో గురువారం శ్రీ హనుమాన్ విగ్రహ ప్రతిష్ఠాపన, శిఖర పూజ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆలయ అభివృద్ధికి రూ.5 లక్షలతో షెడ్ నిర్మాణం, భక్తులకు నీటి సౌకర్యం కల్పించేందుకు బోర్ వేయిస్తానని పేర్కొన్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు, భక్తులు పాల్గొన్నారు.

కార్యవర్గం ఎన్నిక



ఎన్నికైన కార్యవర్గ సభ్యులు

ఆదిలాబాద్‌టౌన్: ఆదివాసీ విద్యార్థి సంఘం నూతన కార్యవర్గాన్ని గురువారం జిల్లా కేంద్రంలో ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా పెందూర్ సంతోష్, సలాం వరుణ్‌లను ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా మర్సుకోల అశోక్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కనక గణేష్, ఉపాధ్యక్షుడిగా మారుతి, చాకటి మహేశ్, కోశాధికారిగా పెందూర్ మహేందర్, ప్రచార కార్యదర్శిగా రజినికాంత్, సలహాదారుడిగా పెందూర్ దీపక్‌లను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో తుడుందెబ్బ రాష్ట్ర కోకన్వీనర్ గోడం గణేష్, పెందూర్ దాదిరావు పాల్గొన్నారు.

ఆర్మీ ఉద్యోగానికి ఎంపికవడం అభినందనీయం



సిద్ధార్థను సన్మానిస్తున్న గ్రామస్తులు

తలమడుగు: మారుమూల గిరిజన గ్రామానికి చెందిన యువకుడు ఆర్మీ ఉద్యోగానికి ఎంపికవడం అభినందనీయమని గ్రామపెద్దలు నల్ల సుభాష్ రెడ్డి అన్నారు. గురువారం పల్లి(బి) గ్రామానికి చెందిన చంద్ర సిద్ధార్థ ఆర్మీ ఉద్యోగానికి ఎంపికవడంతో గ్రామస్తులు సన్మానించారు. ఇదే స్ఫూర్తితో యువకులు కష్టపడి ఉద్యోగ, ఉపాధి అవకాశాలను సాధించాలన్నారు. కార్యక్రమంలో కటకం శ్రీనివాస్, విట్టల్, గంగన్న, మల్కు, అశోక్, రమేశ్, సోమన్న, తదితరులు పాల్గొన్నారు.

దొడ్డి కొమురయ్య జయంతి



నివాళులర్పిస్తున్న సభ్యులు

బోథ్: సొనాల మండల కేంద్రంలో కురుమ సంఘం ఆధ్వర్యంలో దొడ్డి కొమురయ్య జయంతిని గురువారం ఘనంగా నిర్వహించారు. అయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తెలంగాణ తొలి దశ ఉద్యమంలో తెలంగాణ సాయుధ పోరాటంలో భూమికోసం, భుక్తి కోసం, వెట్టిచాకిరి విముక్తి కోసం రజాకార్లతో పోరాడి తొలి అమరుడైన రైతాంగ వీరుడు దొడ్డి కొమురయ్యను స్మరించుకున్నారు. కార్యక్రమంలో నాయకులు కటకం చంద్రకాంత్ బాబు, కసిరి చిన్న పోతున్న, రామాయ శంకర్, దేవన్న, దేవేందర్, నారాయణ, సంతోష్, ప్రశాంత్, విజయ్, పోతన్న, ప్రవీణ్, బోయన్న పాల్గొన్నారు.

చెడువ్యసనాలకు దూరంగా ఉండాలి

ఉట్నూర్‌రూరల్: యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని, జీవితాలను నాశనం చేసుకోవద్దని ఉట్నూర్ సీఐ మొగిలి సూచించారు. గురువారం మండలంలోని బాబాపూర్‌లో పోలీసులు మీ కోసం కార్యక్రమాన్ని నిర్వహించారు. సీఐ గ్రామస్తుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సైబర్ నేరాలు, డ్రగ్స్ వల్ల కలిగే నష్టాలు, అసాంఘిక కార్యకలాపాల గురించి గ్రామస్తులకు వివరించారు. ఎస్సై మనోహర్, సిబ్బంది పాల్గొన్నారు.



ఆలయానికి వస్తున్న మోతిరాంగూడ గ్రామస్తులు



పూజలు చేస్తున్న ఆదివాసీలు



పల్లకి ఊరేగిస్తున్న భక్తులు

వైభవంగా ఆదివాసీల పూజలు

ఇంద్రవెల్లి: మండల కేంద్రంలోని ఇంద్రాదేవి ఆలయంలో గురువారం ఆదివాసీలు చైత్ర మాసం పూజలు నిర్వహించారు. ఉమ్మడి జిల్లా నలుమూలల నుంచి ఆదివాసీలు తరలివచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ పూజలు నెల రోజుల పాటు కొనసాగుతాయని ఆలయ మహరాజ్ చహకటి సూర్యరావ్ తెలిపారు.

బేల: మండలంలోని కాప్సి(బి) గ్రామంలో ఉగాది పండుగ నుంచి కొనసాగుతున్న ఆధ్యాత్మిక గురువు నానాజీ మహరాజ్ పంచమి ఉత్సవ ముగింపు వేడుకలను గురువారం వైభవంగా నిర్వహించారు. స్థానిక ప్రధాన వీధుల గుండా భజన, కీర్తనలతో 101కొబ్బరి కాయలతో పల్లకి ఊరేగింపు చేపట్టారు. ఆధ్యాత్మిక గురువు నానాజీ మహరాజ్ శిష్య బృందం భక్తులకు ఆధ్యాత్మిక ప్రవచనాలు బోధించారు.

సమస్యలను పోలీసుల దృష్టికి తీసుకురావాలి

• ఆదిలాబాద్ డీఎస్పీ జీవన్ రెడ్డి



మాట్లాడుతున్న డీఎస్పీ జీవన్‌రెడ్డి

ఆదిలాబాద్‌టౌన్: సమస్యలు ఉంటే ప్రజలు వార్డు పోలీసుల దృష్టికి తీసుకురావాలని ఆదిలాబాద్ డీఎస్పీ జీవన్ రెడ్డి అన్నారు. 24 గంటల పాటు పోలీసు అధికారులు అందుబాటులో ఉంటారన్నారు. గురువారం ఆదిలాబాద్ పట్టణంలోని శ్రీరామ్ కాలనీలో వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ ఆధ్వర్యంలో నిర్వహించగా, జైనథ్ మండలంలోని ముక్తాపూర్ గ్రామంలో జైనథ్ సీఐ డి.సాయినాథ్, ఎస్సై వి.పురుషోత్తం ఆధ్వర్యంలో చేపట్టారు. ఎక్కడైన అసాంఘిక కార్యకలాపాలు జరిగితే పోలీసుల దృష్టికి తీసుకురావాలన్నారు. సైబర్ నేరాలు, రోడ్డు భద్రత, డయల్ 100, షీటీం, మట్కా, బెట్టింగ్ జరిగితే తెలియజేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో వన్‌టౌన్ సీఐ సునీల్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

బోథ్: పోలీస్ వ్యవస్థ ప్రజల కోసమే ఏర్పడిందని బోథ్ సీఐ వెంకటేశ్వర రావు అన్నారు. మీకోసం పోలీస్ కార్యక్రమాన్ని బోథ్ మండలంలోని అందూర్ గ్రామంలో గురువారం బోథ్ పోలీసుల ఆధ్వర్యంలో నిర్వహించారు. సీఐ వెంకటేశ్వర రావు, ఎస్సై ప్రవీణ్ కుమార్‌లు మాట్లాడుతూ.. ప్రజలు అత్యవసర పరిస్థితుల్లో డయల్ 100కు ఫోన్ చేయాలన్నారు. కార్యక్రమంలో పోలీసులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత

• బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్



లింబాజీ మహరాజ్‌తో ఎమ్మెల్యే అనిల్ జాదవ్

నేరడిగొండ: ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత లభిస్తుందని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. మండలంలోని శంకరపూర్ గ్రామంలో గురువారం నిర్వహించిన శ్రీ హనుమాన్ విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీ లింబాజీ మహరాజ్‌తో కలిసి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామాల్లోని ఆలయాల్లో ప్రతినిత్యం పూజ కార్యక్రమాలు చేపట్టడంతో ఆధ్యాత్మికత నెలకొంటుందన్నారు. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండి భక్తి భావనను అలవర్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న సన్న బియ్యం పంపిణీ



బియ్యం పంపిణీ ప్రారంభిస్తున్న తహసీల్దార్

ఇచ్చోడ: మండలంలోని గుండాల గ్రామంలో గురువారం సన్న బియ్యం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ సీనియర్ నాయకుడు అక్కెపెల్లి లక్ష్మణ్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం సంపన్నులు తినే సన్న బియ్యాన్ని పేదలకు అందిస్తుందన్నారు. కార్యక్రమంలో రేషన్ డీలర్ రాజేశ్వర్, గ్రామస్తుడు సాజిద్ పాల్గొన్నారు.

తాంసి: ప్రభుత్వం రేషన్‌షాప్‌ల ద్వారా లబ్ధిదారులకు అందజేస్తున్న సన్న బియ్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని తాంసి తహసీల్దార్ లక్ష్మి కోరారు. గురువారం మండల కేంద్రంతో పాటు కప్పర్ల గ్రామంలో సన్నబియ్యం పంపిణీ కార్యక్రమాన్ని తహసీల్దార్ లక్ష్మి స్థానిక నాయకులతో కలిసి ప్రారంభించారు. ప్రతీ గ్రామంలోని రేషన్‌షాప్‌ల ద్వారా సన్నబియ్యం పంపిణీ ప్రారంభించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో రేషన్‌షాప్ డీలర్లు సురేశ్, జాదవ్ గణేష్, సంతోశ్, సదానంద్, రామన్న యాదవ్, కొడాల మహేందర్ పాల్గొన్నారు.

బోథ్: మండలంలోని కనుగుట్ట గ్రామంలో గురువారం రేషన్ దుకాణంలో డిప్యూటీ తహసీల్దార్ సూరజ్ సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈసందర్భంగా లబ్ధిదారులకు సన్న బియ్యం పంపిణీ చేశారు. కార్యక్రమంలో రమేశ్, భీమ భుచ్చన్న, గడ్డల నారాయణ, కుమ్మరి ప్రభాకర్ పాల్గొన్నారు.

జంతుశాస్త్రంపై అవగాహన



లెక్చరర్‌ను సన్మానిస్తున్న కళాశాల యాజమాన్యం

ఆదిలాబాద్‌టౌన్: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ సైన్స్ డిగ్రీ కళాశాలలో గురువారం గణితం, జంతుశాస్త్ర విస్తరణ ఉపన్యాసాలు నిర్వహించారు. గిరిజన గురుకుల డిగ్రీ కళాశాల లెక్చరర్లు కాంబ్లే సునీల్ కుమార్, రామకృష్ణలు విద్యార్థులకు ఆయా అంశాలపై అవగాహన కల్పించారు. రామకృష్ణ ఇన్ వర్టిబ్రెట్స్‌ల గురించి వివరించారు. లెక్చరర్లను కళాశాల యాజమాన్యం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ సంగీత, చక్రవర్తి, జగ్‌రాం, అరుణ్ కుమార్, శ్రావణి, జ్ఞానేశ్వర్, రాజ్‌కుమార్, వెంకటేశ్ పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

ప్రత్యేక పూజలు

నేరడిగొండ: మండలంలోని శంకరపూర్ గ్రామంలో గురువారం నిర్వహించిన శ్రీ ఆంజనేయ స్వామి విగ్రహ, శిఖర పునఃప్రతిష్ఠాపన కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర లెక్చరర్ల సంఘం ప్రధాన కార్యదర్శి బలరాం జాదవ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు.

తాంసి: మండల కేంద్రంలోని పోతులూరి వీర బ్రహ్మేంద్రస్వామి ఆలయంలో గ్రామ విశ్వకర్మలు ప్రత్యేక పూజలు చేశారు. గురువారం పూజలు నిర్వహించిన అనంతరం నైవేద్యం స్వామివారికి సమర్పించి ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని వేడుకున్నారు. సుభాశ్, మహేందర్, కార్తీక్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడికి వీడ్కోలు

తాంసి: పిప్పల్‌కోటి ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తూ ఉద్యోగ విరమణ పొందిన ఉపాధ్యాయుడికి గురువారం గ్రామస్తులు, ఉపాధ్యాయులు ఘనంగా వీడ్కోలు పలికారు. ఈసందర్భంగా ఉపాధ్యాయ దంపతులను సత్కరించారు. భీంపూర్ ఎంఈవో శ్యాంసుందర్, హెచ్‌ఎం విలాస్, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌కు సన్మానం

కైలాస్‌నగర్: ప్రతిష్టాత్మక స్కోచ్ అవార్డు అందుకున్న జిల్లా కలెక్టర్ రాజర్షిషాను సనాతన హిందూ ఉత్సవ సమితి సభ్యులు సన్మానించారు. గురువారం కలెక్టరేట్‌లోని ఆయన చాంబర్‌లో మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో సమితి అధ్యక్షుడు ప్రమోద్ కుమార్ ఖత్రి, గెడాం మాధవ్, శశికళ, సూర్యకాంత్, రవీందర్, సతీష్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

ఇచ్చోడ: మండలంలోని 44వ జాతీయరహదారిపై ముఖరా(బి) రోడ్డు వద్ద గురువారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో థాంకే మారుతి, థాంకే కోండిబాలకు తీవ్రంగా గాయపడ్డారు. ఉదయం 9 గంటల ప్రాంతంలో బైక్‌పై వస్తుండగా.. గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టడంతో గాయపడ్డారు. స్థానికులు 108 సమాచారం ఇచ్చి ఆదిలాబాద్‌లో రిమ్స్ తరలించారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన

ఉట్నూర్‌రూరల్: ఆర్‌బీఐ ఆధ్వర్యంలో కొనసాగుతున్న ఆర్థిక అక్షరాస్యత కేంద్రం ఇంద్రవెల్లి ఆధ్వర్యంలో ఉట్నూర్ మండలం పాత ఉట్నూర్‌లో ఉపాధిహామీ కూలీలకు ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కల్పించారు. కార్యక్రమానికి కౌన్సిలర్లు కృష్ణ, ధన్‌జీ, అశ్విన్‌కుమార్‌ల ఆధ్వర్యంలో పొదుపు ఆవశ్యకత, బ్యాంకింగ్ వలన కలిగే లాభాలు, సైబర్ నేరాల గురించి వివరించారు.

పరామర్శ

బోథ్: సొనాల మండలంలోని సాకెర గ్రామానికి చెందిన పాత్రికేయుడు రాథోడ్ దేవిదాస్ తండ్రి ఇటీవల మృతి చెందడంతో కాంగ్రెస్ బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడె గజేందర్ గురువారం ఆయనను పరామర్శించారు.

సప్తాహం ప్రారంభం

గుడిహత్నూర్: మండల కేంద్రంలోని అతిపురాతన శివాలయం వద్ద ఏటా నిర్వహించే అఖండ హరినామ సప్తాహం గురువారం ప్రారంభమైంది. తొలిరోజు మహారాష్ట్రలోని జాల్నాకు చెందిన హరిభక్త పారాయణ్ సాక్షితాయి రవి మహరాజ్ కీర్తన అందించారు. వారం రోజుల పాటు సప్తహం కొనసాగనుంది.

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత

ఉట్నూర్‌రూరల్: మండల కేంద్రంలోని వేణునగర్ కాలనీకి చెందిన లతకు ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు గురువారం స్థానిక క్యాంపు కార్యాలయంలో రూ. 27 వేల రూపాయల సీఎంఆర్ఎఫ్ చెక్కును అందచేశారు. పేదల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తోందన్నారు.

డాక్యుమెంట్ రైటర్ల ఆందోళన

కైలాస్‌నగర్: ఆదిలాబాద్ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో అక్రమ రిజిస్ట్రేషన్ల వ్యవహారంపై గురువారం ఆందోళన చేపట్టారు. కొత్తగా ఏర్పాటు చేసిన లేఅవుట్‌లకు ఎల్ఆర్ఎస్ 2020లో అక్రమంగా రిజిస్ట్రేషన్ చేస్తున్నారని ఆరోపిస్తూ.. కొంతమంది డాక్యుమెంట్ రైటర్లు సబ్‌రిజిస్ట్రార్‌తో వాగ్వాదానికి దిగారు. డబ్బులు తీసుకుని అక్రమంగా రిజిస్ట్రేషన్లు చేస్తారా? అని ప్రశ్నించారు. తమ డాక్యుమెంట్లకు ఎందుకు రిజిస్ట్రేషన్ చేయడం లేదని నిలదీశారు. అరగంట పాటు నిరసన వ్యక్తం చేసిన రైటర్లు సదరు అధికారి నుంచి ఎలాంటి స్పందన లేకపోవడంతో వెనుదిరిగారు.

ఇందిరమ్మ నమూనా ఇల్లు పూర్తి చేయండి



ఇంటిని పరిశీలిస్తున్న అధికారులు

తలమడుగు: మండల కేంద్రంలో నిర్మిస్తున్న ఇందిరమ్మ నమూనా ఇల్లును త్వరగా పూర్తి చేయాలని జిల్లా గృహ నిర్మాణ శాఖ అధికారి బసవేశ్వర రావు అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ఇందిరమ్మ నమూనా ఇల్లు నిర్మాణ పనులను పరిశీలించారు. ఇంటి నమూనాను లబ్ధిదారులకు చూయించేందుకు నిర్మిస్తున్నట్లు తెలిపారు. పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని సూచించారు. కార్యక్రమంలో ఏఈ నసీర్, ఎంపీడీవో చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

ఆదివాసీ బిడ్డకు డాక్టరేట్



డాక్టరేట్ అందుకుంటున్న విఠల్

ఆదిలాబాద్‌రూరల్: ఆదిలాబాద్ పట్టణంలోని తెలంగాణ గిరిజన సంక్షేమ డిగ్రీ కళాశాల (పురుషుల) జంతు శాస్త్ర అధ్యాపకునిగా విధులు నిర్వహిస్తున్న జైనథ్ మండలం బాలాపూర్ గ్రామానికి చెందిన పంద్రే విఠల్ డాక్టరేట్ పొందారు. ఈ డాక్టరేట్‌ను ఎపెక్స్ ఆఫ్ హెర్బిసైడ్ ఎక్స్‌పోజర్ ఆన్ ఎర్త్ వార్మ్స్ (యుటిఫైడ్ వాల్టోని) రిప్రొడక్టివ్ అండ్ డెవలప్‌మెంట్‌లో బయాలజీ అనే అంశంపై పరిశోధనకు గాను డాక్టరేట్ పొందడం జరిగిందన్నారు. జంతు శాస్త్ర విభాధిపతి డాక్టర్ బన్సిధర్ సింగ్ పర్యవేక్షణలో పరిశోధన చేయడం జరిగిందన్నారు. ఈ పట్టాను ఉత్తరప్రదేశ్‌కు చెందిన గ్లోకల్ విశ్వవిద్యాలయం ద్వారా పొందినట్లు పేర్కొన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ శివకృష్ణ, అధ్యాపకులు శాలువాతో సత్కరించి అభినందించారు.

ఛత్రపతి శివాజీకి ఘన నివాళి



నివాళులర్పిస్తున్న యూత్ సభ్యులు

ఆదిలాబాద్‌టౌన్: ఛత్రపతి శివాజీ మహారాజ్ వర్ధంతిని శివాజీ మహరాజ్ యూత్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. గురువారం జిల్లా కేంద్రంలోని శివాజీ చౌక్‌లో విగ్రహానికి క్షీరాభిషేకం చేశారు. రెండు నిమిషాల పాటు మౌనం పాటించారు. ఛత్రపతి శివాజీ చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో దిలీప్, రోహిత్ షిండే, విద్యాసాగర్, సునీల్, లఖన్, సాయి పాల్గొన్నారు.

'పూర్తిస్థాయి రుణమాఫీ కాలేదు'



మాట్లాడుతున్న సంగెపు బొర్రన్న

బోథ్: జిల్లాలోని రైతులకు రుణమాఫీ, రైతుబంధు పూర్తిస్థాయిలో అందలేదని రైతు స్వరాజ్య వేదిక జిల్లా అధ్యక్షుడు సంగెపు బొర్రన్న అన్నారు. బోథ్ నియోజకవర్గ కేంద్రంలో గురువారం ఆయన మాట్లాడారు. ఖరీఫ్‌లో ఇవ్వాల్సిన పెట్టుబడి సాయం అందని లేదన్నారు. మరోవైపు రుణమాఫీ 27,432 మందికి రుణమాఫీ కాలేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మిగిలిపోయిన రైతులందరికీ రైతు భరోసా నిధులతో పాటు పంట రుణమాఫీని చేయాలని కోరారు. కార్యక్రమంలో రాంరెడ్డి, గంగాధర్, చరణ్ దాస్, మురళీధర్ రెడ్డి, నారాయణ, రవీందర్ రెడ్డి పాల్గొన్నారు.

ఉపాధి పనులు వేగవంతం చేయాలి



కూలీలతో మాట్లాడుతున్న డీఆర్‌డీవో రవీందర్

ఇంద్రవెల్లి: ఎంజీఎన్ఆర్ఈజీఎస్ పథకం ద్వారా కొనసాగుతున్న ఉపాధి పనులను వేగవంతం చేయాలని డీఆర్‌డీవో రాథోడ్ రవీందర్ అన్నారు. గురువారం మండలంలోని ఇన్కార్‌గూడ గ్రామంలో జరుగుతున్న ఉపాధి పనులను పరిశీలించారు. కూలీలు పనులను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఉపాధి పనులపై నిర్లక్ష్యం చేయవద్దన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీవో జీవన్‌రెడ్డి, ఏపీవో జాదవ్ శ్రీనివాస్, ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

ఇంద్రవెల్లి: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల్లో ఉన్న సమస్యలను పరిష్కరించడానికే పైలెట్ ప్రజావాణి కార్యక్రమం ఏర్పాటు చేయడం జరుగుతుందని డీఆర్‌డీవో రాథోడ్ రవీందర్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన పైలెట్ ప్రజావాణి, ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి హాజరయ్యారు. ప్రజా ఫిర్యాదులను స్వీకరించి, వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్, ఇన్‌చార్జి ఎంపీడీవో జీవన్‌రెడ్డి, వ్యవసాయాధికారి రాథోడ్ గణేష్ పాల్గొన్నారు.

'మా భూమి రథయాత్ర' విజయవంతం చేద్దాం



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న గణేష్

తలమడుగు: తెలంగాణలో బీసీ, ఎస్సీ, ఎస్టీ మైనార్టీ, అగ్రవర్ణ పేదల రాజ్యస్థాపన కోసం విశారదన్ మహరాజ్ చేపట్టే లక్ష కిలో మీటర్ల 'మా భూమి రథయాత్ర' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ధర్మ సమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షుడు అగ్గి మల్ల గణేష్ పిలుపునిచ్చారు. గురువారం మండలంలోని ఖోడద్, కజ్జర్ల, తలమడుగు గ్రామాల్లో పర్యటించి కరపత్రాలు ఆవిష్కరించారు. ఏప్రిల్ 14న ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని డైట్ మైదానంలో బహిరంగ సభ నిర్వహించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో నాయకులు నవీన్, గంగన్న, శ్రీనివాస్, విను కుమార్, గోవర్ధన్, మధుకర్, వినీల్ పాల్గొన్నారు.

నీటికుంట భూరికార్డులివ్వండి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్తులు

బోథ్: మండలంలోని కౌఠ(బి) గ్రామ శివారులోని 149/ఆ సర్వే నంబరులో నీటి కుంట భూమికి సంబంధించిన రికార్డులు ఇవ్వాలని గ్రామస్తులు గురువారం తహసీల్దార్ సుభాష్ చందర్‌కు వినతిపత్రం అందజేశారు. గతంలో గ్రామంలో నీటి కొరత కారణంగా నీటికుంట నిర్మాణానికి 149/ఆ సర్వే నంబరులో 4.26 భూమిని కొనుగోలు చేసినట్లు తెలిపారు. ఈ భూమిలో ఎంపీల్యాడ్స్ నిధులతో నీటి కుంటను నిర్మించినట్లు పేర్కొన్నారు. ఇదే సర్వే నంబరులో ప్రస్తుతం జాదవ్ గోపాల్ పేరిట ఉన్నట్లు రికార్డుల్లో ఉందని తహసీల్దార్ దృష్టికి తీసుకువచ్చారు. ఆయన పేరిట నీటికుంట ఉన్న భూమి ఎలా వచ్చిందో రికార్డులను చూసి ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో గ్రామస్తులు రమణరెడ్డి, మురళీధర్ రెడ్డి, నర్సయ్య, నగేశ్‌రెడ్డి, బాపురెడ్డి, చరణ్‌దాస్ రెడ్డి, రమణరెడ్డి, రమేశ్ పాల్గొన్నారు.

రజతోత్సవ సభ విజయవంతం చేయండి



సమావేశంలో పాల్గొన్న జోగు రామన్న

ఆదిలాబాద్‌టౌన్: బీఆర్ఎస్ రజతోత్సవ సభను చరిత్రలో నిలిచిపోయే విధంగా ఘనంగా నిర్వహించాలని మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ పిలుపునిచ్చారు. ఎర్రవల్లిలోని కేసీఆర్ నివాసంలో గురువారం నిర్వహించిన సమావేశంలో మాజీ మంత్రి జోగు రామన్న పాల్గొన్నారు. ఈనెల 27న వరంగల్‌లో జరగనున్న బహిరంగ సభ, రజతోత్సవ కార్యక్రమాల నిర్వహణపై చర్చించారు. ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలు, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు తదితర అంశాలపై చర్చించినట్లు జోగు రామన్న పేర్కొన్నారు.



అసలే వేసవి కాలం.. భూగర్భజలాలు అడుగంటిపోతున్నాయి. దీంతో చాలా ప్రాంతాల్లో నీరు దొరకక ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. అయితే మావల మండల కేంద్రంలోని ఉషోదయ కాలనీలో పైప్ లైన్ లీకేజీ కారణంగా వారం రోజులుగా మిషన్ భగీరథ నీరు వృథాగా పోతోంది. అయినా.. అధికారులు పట్టించుకోవడం లేదని కాలనీవాసులు ఆరోపిస్తున్నారు. వెంటనే మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు. - ఆదిలాబాద్ రూరల్